డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
RNI NO: TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM
ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

విలేకరులు కావలెను..
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి | ఆదివారం | 08-02-2026 | సంపుటి: 01 | సంచిక : 21 | పేజీలు : 08 | వెల :02/- |
|---|---|---|---|---|---|---|
| Peddapalli | Sunday | 08-02-2026 | Volume: 01 | Issue: 21 | Pages: 08 | Cost :02/- |



## మల్లు అనంత రాములు వర్ధంతి.

స్నానాల లక్ష్మీపురంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కుటుంబసభ్యులతో ఘన నివాళులు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన ఆశయ సాధనకు నిరంతర కృషి. 2

### అనేక సవాళ్లను అధిగమిస్తూ
# ముందుకు.
## సీఎం రేవంత్ రెడ్డి

- గోదావరి జలాలతో తాండూరు పరిగి వికారాబాద్ సస్యశ్యామలం.
- మూడేళ్లలో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పూర్తి.
- తాండూరులో డ్రైనేజీ, తాగునీటి పనులు పూర్తి చేస్తాం.
- వికారాబాద్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం.



**జనం వాయిస్, వికారాబాద్:** గోదావరి జలాల ద్వారా తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే వచ్చే మూడేళ్లలో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి లక్షా యాభై వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. "ప్రజా పాలనప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా నారాయణపూర్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. మిగతా 2 లో...

## మలేషియాలో భారతీయ సమాజంతో బలోపేతం

ప్రధాని నరేంద్ర మోదీ



2




2

### అగ్ని ప్రమాదం షార్ట్
# సర్క్యూట్ వల్లే.

### రేవంత్ ఏనాటికైనా
# బీజేపీ మనిషే

- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు.
- కాంగ్రెస్ ముసుగు తొలగించండి అంటూ ప్రజలకు పిలుపు.
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తీవ్ర విమర్శలు.
- పోచారం చేరికపై ప్రశ్నల వర్షం.



**జనం వాయిస్, బాన్సువాడ:** రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషేనని, ఆయన ఎప్పటికీ కాంగ్రెస్ నేత కాలేడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బాన్సువాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన, రేవంత్ రెడ్డి కప్పుకున్న కాంగ్రెస్ ముసుగును తొలగించి చూడాలని ప్రజలను కోరారు. రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడేనని విమర్శించారు. రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కేటీఆర్ మిగతా 2 లో...

## బ్యాక్‌డోర్ నియామకాలు.

కల్వకుంట్ల కవిత ఆరోపణలు

- బ్యాక్‌లాగ్ పోస్టుల ఏ పేరుతో అక్రమ భర్తీ?.
- జిల్లా స్థాయిలో దొడ్డిదారిన నియామకాలు.
- లక్షల రూపాయల వసూళ్లపై ఆరోపణలు.



3

## వామ్మో పెద్దపులి



- ☐ జనగామ యాదాద్రి మధ్య సంచరిస్తున్న పెద్దపులి.
- ☐ ప్రజల్లో భయాందోళన.
- ☐ మహారాష్ట్ర నుంచి 250 కిలోమీటర్లు ప్రయాణం.
- ☐ లేగదూడపై దాడి చేసి చంపిన పెద్దపులి.
- ☐ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సూచనలు.

**జనం వాయిస్, జనగామ/యాదాద్రి భువనగిరి:** మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన ఒక పెద్దపులి దాదాపు రెండు వందల యాభై కిలోమీటర్లు ప్రయాణించి, దట్టమైన అడవి కోసం వెతుకుతూ ప్రస్తుతం జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల మధ్య అటూఇటూ మిగతా 3 లో...

## కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

– రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు

- తాండూరు, వికారాబాద్, చేవెళ్లలో ఎన్నికల ప్రచార సభలు.
- పట్టణ మౌలిక సదుపాయాల పునరుజ్జీవనం.
- యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.



3

## మేడారంలో టన్నుల కొద్దీ చెత్త



- అధికార యంత్రాంగానికి, పారిశుద్ధ్య సిబ్బందికి పెద్ద సవాల్.
- జాతర అనంతరం చెత్త కుప్పలు.

3

## రీల్ పిచ్చితో ప్రాణం పోయింది



3

- ఉరి సీన్ రీల్ తీస్తూ మహిళ మృతి.
- ప్రమాదవశాత్తు మెడకు బిగుసుకున్న తాడు.
- నాలుగేళ్ల కూతురు కళ్లముందే విషాదం.

# ఎడిటోరియల్

## కుటుంబ జీవితాన్ని దెబ్బతీస్తున్న ఉద్యోగ ఒత్తిళ్లు

**- పనిలో విజయం వెనుక కరుగుతున్న అనుబంధాల కథ**

**జనం వాయిస్, ఎడిటోరియల్:**

ఆధునిక జీవనంలో ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదు. అది గుర్తింపు, భద్రత, గౌరవానికి మార్గంగా మారింది. ఈ మార్పుతో పాటు ఉద్యోగాలపై ఒత్తిళ్లు కూడా పెరిగాయి. పనిలో విజయం సాధించాలనే తపన, పోటీ, లక్ష్యాలు, సమయపరిమితులు ఇవన్నీ కలసి మనిషిని నిరంతర ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. ఈ ఒత్తిడి ప్రభావం పనివేదికతోనే ఆగిపోవడం లేదు. అది నేరుగా కుటుంబ జీవితంలోకి చొరబడుతోంది. ఉద్యోగ ఒత్తిళ్ల వల్ల మొదటగా దెబ్బతినేది సమయం. ఎక్కువ గంటలు పని చేయడం, ఇంటికొచ్చాక కూడా పనిని మనసులోనే మోసుకెళ్లడం వల్ల కుటుంబానికి కేటాయించే సమయం తగ్గిపోతుంది. ఒకే ఇంట్లో ఉన్నా, కుటుంబ సభ్యుల మధ్య మాటలు తగ్గుతాయి. భోజన సమయాలు కలిసి గడవడం అరుదవుతుంది. ఈ మౌనం క్రమంగా దూరంగా మారుతుంది.

పని ఒత్తిడి మనసును అలసటకు గురిచేస్తుంది. ఆ అలసట ఇంట్లో చిరాకు రూపంలో బయటపడుతుంది. చిన్న విషయాలకే కోపం రావడం, సహనం తగ్గిపోవడం, కుటుంబ సభ్యుల మాటలకు స్పందించలేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడతాయి. ఈ మార్పులను కుటుంబ సభ్యులు గమనించినా, కారణం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా అపార్థాలు పెరుగుతాయి.

తల్లిదండ్రులపై ఉద్యోగ ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. తల్లిదండ్రుల సమయం, శ్రద్ధ తగ్గడంతో పిల్లలు భావోద్వేగంగా ఒంటరిగా మారుతారు. వారి విజయాలు, సమస్యలు, సందేహాలు పంచుకునే వేదిక లేకుండా పోతుంది. ఇది పిల్లల మానసిక ఎదుగుదలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది.


దాంపత్య జీవితంలో కూడా ఉద్యోగ ఒత్తిళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. జీవిత భాగస్వాములతో భావాలను పంచుకునే సమయం లేకపోవడం, పరస్పర సహకారం తగ్గిపోవడం వల్ల బంధం బలహీనమవుతుంది. ఒకప్పుడు ఆనందంగా గడిపిన క్షణాలు గుర్తుగా మాత్రమే మిగులుతాయి. బాధ్యతలు పెరిగినా, అనుబంధం పెరగకపోవడం కుటుంబాన్ని లోపలినుంచి ఖాళీ చేస్తుంది. ఉద్యోగ భద్రతపై భయాలు కూడా కుటుంబ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రేపటి అవసరాలపై ఆందోళన, ఖర్చుల భారం, భవిష్యత్తుపై అనిశ్చితి మనసును ఎప్పుడూ ఉద్విగ్నంగా ఉంచుతుంది. ఈ భయాలు కుటుంబ సభ్యులతో స్వేచ్ఛగా మెలగడాన్ని అడ్డుకుంటాయి. ఆనందాన్ని ఆస్వాదించే మనసు క్రమంగా తగ్గిపోతుంది.

ఇక్కడ సమస్య ఉద్యోగం కాదు. ఉద్యోగం చుట్టూ ఏర్పడిన అసమతుల్యతే అసలు సమస్య. పని, కుటుంబం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వలేకపోవడమే ఈ సంక్షోభానికి మూలం. కుటుంబం కోసం పని చేస్తున్నామనే భావన ఉన్నప్పటికీ, ఆ కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోవడం ఒక విరోధాభాసంగా మారింది. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ఆలోచనల్లో మార్పు అవసరం. పనికి పరిమితి ఉండాలి. కుటుంబానికి కేటాయించే సమయం కూడా బాధ్యతగా భావించాలి. పనిలో ఒత్తిడిని ఇంటికి మోసుకురావకుండా ఉండే ప్రయత్నం చేయాలి. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, వారి భావాలను వినడం, కలిసి సమయం గడపడం ఇవే కుటుంబ బంధాలను నిలబెట్టే పునాదులు. ఉద్యోగ విజయం జీవితానికి అవసరమే. కానీ అదే జీవితం నుంచి ఆనందాన్ని తీసుకుంటే, ఆ విజయం అర్థం కోల్పోతుంది. కుటుంబమే మనిషికి నిజమైన ఆశ్రయం. ఆ ఆశ్రయం బలంగా ఉన్నప్పుడే ఏ ఉద్యోగ ఒత్తిడినైనా ఎదుర్కొనే శక్తి లభిస్తుంది. పనిలో ఎదగడం మంచిదే, కానీ కుటుంబాన్ని కోల్పోయే స్థాయికి కాదు. ఈ సమతుల్యతను సాధించడమే నేటి సమాజానికి అతిపెద్ద అవసరం.

# అనేక సవాళ్లను అధిగమిస్తూ ముందుకు.

**మొదటిపేజీ తరువాయి...**

లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణతో పాటు అవసరమైన ప్రణాళికలను తక్షణమే చేపడతామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. తాండూరు పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయడంతో పాటు కాగ్నా నది నుంచి తాగునీటిని అందించే కార్యక్రమాలను అమలు చేస్తామని సీఎం తెలిపారు. సంవత్సరం తిరిగేలోపు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ, అక్కడి నుంచి తాండూరు వరకు రహదారి నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు రేడియల్ రోడ్లను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో వికారాబాద్ జిల్లా అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారబోతోందని సీఎం పేర్కొన్నారు. మౌలిక వసతులు, రవాణా సౌకర్యాల అభివృద్ధితో జిల్లా రూపురేఖలు మారతాయని అన్నారు. అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, ప్రజలంతా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో రైతాంగం, నిరుద్యోగ యువత, మహిళలను ప్రాధాన్యంగా పెట్టుకుని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలోని ఆరు వేల ఆరు వందల యాభై స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీ




నిధి కింద ఐదు వందల అరవై ఏడు కోట్ల అరవై తొమ్మిది లక్షల రూపాయల చెక్కును మహిళా ప్రతినిధులకు అందజేశారు. ఈ బహిరంగ సభలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మల్లు అనంతరాములు వర్ధంతి

**జనం వాయిస్, స్నానాల లక్ష్మీపురం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, మాజీ ఎంపీ స్వర్గీయ మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా నేడు ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో ఉన్న సమాధి వద్ద కుటుంబసభ్యులతో కలిసి నివాళులు అర్పించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మల్లు అనంతరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి ఆయన కీలక పాత్ర పోషించారని, ప్రజా సమస్యల పరిష్కారానికి దిక్సూచిలా పనిచేశారని పేర్కొన్నారు. సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన మల్లు అనంతరాములు ఆశయాలు ఇప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల కోసం పోరాడిన ఆయన జీవితం తరతరాలకు ఆదర్శమని అభిప్రాయపడ్డారు. స్వర్గీయ మల్లు అనంతరాములు ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తామని, ఆయన చూపిన మార్గంలోనే ప్రజాసేవ కొనసాగిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# మలేషియాలో భారతీయ సమాజంతో బలోపేతం

**జనం వాయిస్, కౌలాలంపూర్:** మలేషియాలోని భారతీయ సమాజంతో భారతదేశానికి ఉన్న అనుబంధాన్ని మరింత పటిష్టం చేసే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కౌలాలంపూర్‌లో జరిగిన కమ్యూనిటీ కార్యక్రమంలో మలేషియాలో భారతీయుల చరిత్ర, సంస్కృతి, సేవలను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శన నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. మలేషియాలో నివసిస్తున్న భారతీయ వంశజులకు సంబంధించి, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు అర్హతను ఆరవ తరం వరకు విస్తరించాలన్న భారత ప్రభుత్వ నిర్ణయం అక్కడి డయాస్పోరాలో అపారమైన ఆనందాన్ని కలిగించిందని ప్రధాని పేర్కొన్నారు. ఈ నిర్ణయం భారతీయ మూలాలు కలిగిన ప్రజలతో భారతదేశానికి ఉన్న భావోద్వేగ బంధాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు. రాబోయే కాలంలో మలేషియాలో భారత కాన్సులేట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని ప్రకటించారు. ఈ చర్యతో భారతదేశంమలేషియా దేశాల మధ్య ప్రజా సంబంధాలు, సాంస్కృతిక అనుబంధం, ఆర్థిక సహకారం మరింత విస్తరించనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రాహీంను ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ, ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు భవిష్యత్తులో మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతీయ సమాజం రెండు దేశాల మధ్య వంతెనగా నిలుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

# అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లే

- **ఫైర్ డీజీ విక్రమ్ సింగ్.**
- **సీజ్డ్ ప్రాపర్టీస్ గది పూర్తిగా దగ్ధం.**
- **భవనం పాతదే, స్విచ్ బోర్డు వద్దే మంటలు.**
- **హైదరాబాద్‌లో అన్ని భవనాల తనిఖీకి ఆదేశాలు.**

**జనం వాయిస్, హైదరాబాద్:** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ స్పందించారు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం షార్ట్ సర్క్యూట్‌గానే భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా, ఆ గది పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ఫోరెన్సిక్ భవనం చాలా పాతదని, దీనిని పద్దెనిమిది వందల ఎనభైయేళ్లలో నిర్మించారని తెలిపారు. చివరి గదిలో ఉన్న స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే మంటలు చెలరేగాయని చెప్పారు. అక్కడి నుంచి మంటలు వేగంగా వ్యాపించినప్పటికీ, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారని వివరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని ఫైర్ డీజీ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలన్నింటినీ తనిఖీ చేస్తామని తెలిపారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని, సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని ఆయన వెల్లడించారు.

# రేవంత్ ఏనాటికైనా బీజేపీ మనిషే

**మొదటిపేజీ తరువాయి...** పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ఎప్పటికీ కాంగ్రెస్ మనిషి కాలేడని, ముందు నుంచే బీజేపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపించారు. అధికారంలో ఉన్నాం కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలన్న కాంగ్రెస్ వాదన అర్థరహితమని, గత రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న రెండేళ్ల తర్వాత మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, అప్పట్లో గతంలో మాదిరిగా పట్టణాలను కాంగ్రెస్ కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. మైనారిటీలకు, బీసీలకు భారీ బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఎన్నికల హామీలు అమలైతే వాటి లబ్ధిదారులే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, మిగిలినవారు వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంపై కేటీఆర్ తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో రేవంత్ రెడ్డి పోచారంపై చేసిన తీవ్ర వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పులను సభలో వినిపించారు. అప్పట్లో పోచారాన్ని, ఆయన కుటుంబాన్ని దూషించిన వ్యక్తితోనే ఇప్పుడు ఆయన ఎందుకు కాంగ్రెస్ సంకన చేరారని ప్రశ్నించారు. వెంకటేశ్వరుని సాక్షిగా జీవితాంతం కేసీఆర్ వెంట ఉంటానని చెప్పిన పోచారం మాటలను కూడా ప్రజల ముందుంచారు. రేవంత్ రెడ్డి విసిరే ఎంగిలి మెతుకుల కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరినా, వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని కేటీఆర్ అన్నారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండా ఎగరాలని కోరుకుంటున్నారని చెప్పారు. దమ్ముంటే పోచారం శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేసి ప్రజల వద్దకు రావాలని సవాల్ విసిరారు. ప్రజలు ఎవరి వైపు ఉన్నారో తేల్చుకుంటారని స్పష్టం చేశారు.

దినమిన్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM

# బ్యాక్‌డోర్ నియామకాలు.

**జనం వాయిస్, హైదరాబాద్:**

రాష్ట్రంలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ పేరుతో దొడ్డిదారిన నియామకాలు జరుగుతున్నాయని కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, విద్య తదితర శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు. నియామకాల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, నిబంధనలను పక్కన పెట్టి అక్రమంగా చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. ఒక్కో ఉద్యోగానికి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారన్న నిరుద్యోగుల ఆవేదనను ఆమె ప్రస్తావించారు. అర్హత, పరీక్ష, ప్రతిభ వంటి ప్రమాణాలను విస్మరించి నియామకాలు జరగడం వల్ల నిజమైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలో దొడ్డిదారిన నియామకాలు జరుగుతున్నాయన్న సమాచారం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ విధమైన చర్యల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆమె మండిపడ్డారు. ఉపాధి ఆశతో ఎదురు చూస్తున్న యువతకు ప్రభుత్వ వైఖరి నిరాశనే మిగులుస్తోందని, ఉద్యోగ భర్తీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమ నియామకాల వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన నిరుద్యోగులు, యువతనే ఇప్పుడు ప్రభుత్వం మోసం చేస్తోందని ఆమె ఆరోపించారు. ఉద్యోగాల పేరిట ఆశలు చూపి చివరికి యువత నోట్లో మట్టి కొట్టినట్లవుతోందని వ్యాఖ్యానించారు. తక్షణమే ఈ నియామకాలను నిలిపివేసి, న్యాయబద్ధమైన, పారదర్శకమైన విధానంతో మాత్రమే ఉద్యోగ భర్తీ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## వామ్మో పెద్దపులి

**మొదటిపేజీ తరువాయి...** సంచరిస్తోంది. ఈ రెండు జిల్లాల్లో గత యాభై ఏళ్లుగా పెద్దపులి కనిపించిన దాఖలాలు లేవని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒక్కసారిగా పులి కదలికలు మొదలవడంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక ప్రాంతం నుంచి లింగాలఘనపురం మండలం కుందారం శివారులో సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు ధ్రువీకరించారు. శుక్రవారం రఘునాథపల్లి మండలం మండలగూడెం పరిసరాల్లో ఓ రైతుకు చెందిన లేగదూడపై దాడి చేసి చంపినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు కొండల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, డీఎఫ్‌వో లావణ్య పరిశీలించి పులి పాదముద్రలను గుర్తించారు. అటవీ శాఖ సమాచారం ప్రకారం, ఈ పెద్దపులి గత సంవత్సరం నవంబరులో మహారాష్ట్ర పాండవఖారా డివిజన్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించింది. కొద్ది రోజులు కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఉండి, ఆ తర్వాత అక్కడి నుంచి జిల్లాల వైపు కదలికలు మొదలుపెట్టింది. ప్రస్తుతం దట్టమైన అడవి ప్రాంతం లేకపోవడంతో దారి తెలియని పరిస్థితిలో గ్రామాల సమీపంలో తిరుగుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. పులి కదలికల నేపథ్యంలో పోలీసులు, అటవీ శాఖలు పలు సూచనలు జారీ చేశాయి. రాత్రివేళ బయటకు వెళ్లవద్దని, అత్యవసరమైతే ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా పెద్దపులి కదలికలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. పశువులను రాత్రివేళల్లో బహిరంగ ప్రదేశాల్లో ఉంచవద్దని హెచ్చరించారు. ఈ పరిణామాలపై అటవీ శాఖ ప్రధాన వన సంరక్షణాధికారి డాక్టర్ సువర్ణ జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థకు నిరంతరం సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. పెద్దపులిని భయపెట్టకూడదని, దాడిలో చనిపోయిన పశుమాంసాన్ని తిననివ్వాలని ఎన్టీసీఏ నుంచి సూచనలు వచ్చినట్లు చెప్పారు. ఆకలి తీరితే పులి ఆందోళన తగ్గి అటవీ ప్రాంతం వైపు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దపులి జాడలను అనుసరించే అనుభవం ఉన్న తొమ్మిది మంది ట్రాకర్లను కాగజ్‌నగర్, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి అటవీ శాఖ పిలిపించింది. పులి దాడిలో పశువులు చనిపోయినట్టు ఫిర్యాదు చేస్తే మూడు రోజుల్లో పరిహారం చెల్లిస్తామని అటవీ శాఖ అధికారులు స్థానికులకు భరోసా ఇచ్చారు. ప్రజలు సహకరించాలని, అనవసరంగా గుమికూడకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

## కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

**జనం వాయిస్, తాండూరు / వికారాబాద్ / చేవెళ్ల:**
తెలంగాణలో అర్థవంతమైన పట్టణాభివృద్ధి కాంగ్రెస్ నాయకత్వంలోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తాండూరు, వికారాబాద్, చేవెళ్ల పట్టణాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలను ఇప్పుడు ప్రణాళికాబద్ధమైన పౌర మౌలిక సదుపాయాలు, మెరుగైన సేవలు, బాధ్యతాయుత ఆర్థిక నిర్వహణతో తిరిగి పుంజుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందని చెప్పారు. యువత భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆయన తెలిపారు. ఇప్పటికే డెబ్బై వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. దీని ద్వారా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కొన్ని వర్గాలు తప్పుడు ప్రచారం చేస్తున్నప్పటికీ, ప్రజల నుంచి లభిస్తున్న బలమైన స్పందన కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. సమగ్ర పట్టణాభివృద్ధి, సమాన అవకాశాల కల్పన అనే కాంగ్రెస్ దృక్పథానికి ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం దక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# రీల్ పిచ్చితో ప్రాణం పోయింది

**జనం వాయిస్, బండా:**
సోషల్ మీడియా రీల్స్ పిచ్చి ఓ మహిళ ప్రాణాలు తీసింది. ఉరి వేసుకున్నట్టుగా రీల్ చిత్రీకరించేందుకు ప్రయత్నించిన మహిళ ప్రమాదవశాత్తు ఉరి తాడుకు బిగుసుకుని మృతి చెందిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బండా జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. మృతురాలిని 27 ఏళ్ల మోహినిగా పోలీసులు గుర్తించారు. ఆమె తరచూ రీల్స్ రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుండేదని తెలిపారు. ఈ క్రమంలో ఉరి వేసుకున్నట్టుగా నటిస్తూ రీల్ తీయాలని భావించిన మోహిని, ఇంట్లో స్టూల్‌పై నిలబడి మెడకు ఉరి తాడు వేసుకుంది. అయితే అకస్మాత్తుగా కాలు జారడంతో ఆమె అదుపుతప్పి కిందకు పడిపోయింది. దీంతో ఉరి



తాడు మెడకు బిగుసుకుని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటన సమయంలో ఇంట్లోనే ఉన్న నాలుగేళ్ల కుమార్తె గదిలోకి వచ్చి తల్లి ఉరికి వేలాడుతూ కనిపించడంతో భయాందోళనకు గురైంది. వెంటనే సహాయం కోసం కేకలు వేయడంతో పొరుగువారు అక్కడికి చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్ట్‌మార్టం కోసం తరలించారు. మోహిని మొబైల్ ఫోన్‌లో లభించిన వీడియో రికార్డుల ఆధారంగా రీల్ కోసం చేసిన ప్రయత్నంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. అయితే ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

## మేడారంలో టన్నుల కొద్దీ చెత్త

**జనం వాయిస్, మేడారం:**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర వైభవంగా ముగిసింది. కోట్లాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని స్వస్థలాలకు చేరుకున్న అనంతరం, మేడారం పరిసర ప్రాంతాలు మాత్రం టన్నుల కొద్దీ చెత్తతో నిండిపోయాయి. ఈ వ్యర్థాలను తొలగించడం ఇప్పుడు అధికార యంత్రాంగానికి, పారిశుద్ధ్య సిబ్బందికి పెద్ద సవాల్‌గా మారింది. మేడారం కేంద్రంగా కన్నెపల్లి, నార్లాపూర్, కొంగల గట్టు తదితర ప్రాంతాల్లో దాదాపు 3 వేల టన్నుల వరకు చెత్త పేరుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు వదిలివెళ్లిన ప్లాస్టిక్, గాజు సీసాలు, ఆహార వ్యర్థాలతో పాటు జంతువులు, కోళ్ల అవశేషాలు భారీగా పేరుకుపోయాయి. ముఖ్యంగా ఈ జంతు వ్యర్థాలు కుళ్లిపోవడంతో పరిసర ప్రాంతమంతా తీవ్ర దుర్గంధంతో నిండిపోయింది. ఈ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు సుమారు 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులను రంగంలోకి దింపారు. యుద్ధప్రాతిపదికన చెత్త తొలగింపు, శుభ్రతా కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ పనిభారం తీవ్రంగా ఉందని అధికారులు చెబుతున్నారు. అడవులు, కొండ ప్రాంతాలు కావడంతో యంత్రాలు పూర్తిస్థాయిలో ఉపయోగించలేకపోతుండటం సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తోంది. అయితే, ఈ పనుల్లో పాల్గొంటున్న పారిశుద్ధ్య కార్మికులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. “రోడ్లు, ప్లాస్టిక్ క్లీనింగ్ పని అని చెప్పి తీసుకొచ్చారు. కానీ ఇక్కడ జంతువుల తోళ్లు, తలకాయలు, కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా ఉన్నాయి. వాటిని చూస్తుంటేనే వాంతులు వస్తున్నాయి. ఇంత గలీజు పని మేమెప్పుడూ చేయలేదు” అని కొందరు కార్మికులు వాపోయారు. అమ్మవార్ల దయతోనే ఈ పని చేస్తున్నామని, లేకపోతే తట్టుకోవడం కష్టమని వారు కన్నీటిపర్యంతమయ్యారు. అధికారుల లెక్కల ప్రకారం జాతరలో పోగైన వ్యర్థాల్లో సుమారు 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాల వంటి పర్యావరణానికి హానికరమైన పదార్థాలే ఉన్నాయి. దాదాపు 100 టన్నుల ఖాళీ బాటిళ్లు ఉండగా, వాటిలో చాలా వరకు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. మిగిలిన 52 శాతం బియ్యం, బెల్లం వంటి భూమిలో కలిసిపోయే వ్యర్థాలుగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం చెత్తను వర్గీకరించి, మేడారం ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రపరిచే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.





## అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ

- కమలం గుర్తుకు ఓటు వేయాలని ఈటెల పిలుపు.
- కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం.
- భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి.

**జనం వాయిస్, సిద్దిపేట:**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఎంపీ ఈటెల రాజేందర్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాలుగో వార్డు అభ్యర్థి రొట్టెల శ్రీనివాస్, ఐదో వార్డు అభ్యర్థి సల్ల అన్నపూర్ణ శ్రీనివాస్, ఆరో వార్డు అభ్యర్థి పీర్ల సిద్దేశ్వరి శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన ప్రజలను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గజ్వేల్‌కు విచ్చేసిన ఈటెల రాజేందర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, పట్టణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పారదర్శక పాలన, మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, గజ్వేల్ పట్టణ ఎన్నికల ఇంచార్జి ఆకుల విజయ, విశాలిని, పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, సీనియర్ నాయకులు జశ్వంత్ రెడ్డి, నత్తి మల్లేష్, కే. ప్రసాద్, లక్ష్మణ్ గౌడ్, ఇల్లు రామ్ రెడ్డి, నల్లగాన శ్రీనివాస్, కే. రాములు తదితరులు పాల్గొన్నారు. కమలం పువ్వు గుర్తుకే మన ఓటు అంటూ ఈటెల రాజేందర్ పిలుపునిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు ఘన విజయం అందించాలని కోరారు.



## కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

- ముషీరాబాద్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం.
- బస్తీవాసుల సమస్యలపై నేరుగా చర్చ.
- ప్రజా సదుపాయాల విస్తరణకు కట్టుబాటు.
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.



**జనం వాయిస్, హైదరాబాద్:**

ముషీరాబాద్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో స్థానిక ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన వేదిక లభిస్తుందని మంత్రి తెలిపారు. బస్తీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్, గౌరవ ఎమ్మెల్యే ముఠా గోపాల్తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, జవహర్‌నగర్‌ను మరింత మెరుగైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

## గోదావరిఖని లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలించిన పెద్దపల్లి డీసీపీ.



**జనం వాయిస్, గోదావరిఖని:**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి తో కలిసి అశోక్ నగర్, రమేష్ నగర్, చంద్ర శేఖర్, 7 ఎల్ ఈ పి, తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలపై, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, సిబ్బంది కేటాయింపు వంటి అంశాలను డీసీపీ అధికారులతో చర్చించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిబంధనలు ఖచ్చితంగా పాటించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ కు వచ్చే ఓటర్లకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందజేత.

**జనం వాయిస్, పెద్దపల్లి:**

పెద్దపల్లి జిల్లా రామగిరి పోలీస్ స్టేషన్లో సెంటినరి కాలనీ కి చెందిన గట్ల సంపత్ రెడ్డి, బేగంపేట గ్రామానికి చెందిన గాజుల శైలజ, లక్కేపూర్ గ్రామానికి చెందిన ఈసంపల్లి సురేష్ ల యొక్క మిస్సయిన ముగ్గురి ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి తిరిగి వారికి అందజేయడం జరిగిందని రామగిరి ఎస్సై టి శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న ఎడల సీఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేసినచో వారి ఫోన్లను ట్రేస్ చేసి తిరిగి వారికి అందజేయడం జరుగుతుందని రామగిరి ఎస్ఐ టీ. శ్రీనివాస్ తెలిపారు.




## దోమలు బాబోయ్ దోమల్...

- జంకుతున్న ఉప్పల్ సర్కిల్ వాసులు.
- జోనల్ కమిషనర్ కు వినతిపత్రం.

**జనం వాయిస్, ఉప్పల్:**

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని దోమల బెడద నుండి ప్రజలకు విముక్తి కల్పించాలని స్థానిక ప్రజా ప్రతినిధులు ఉప్పల్ సర్కిల్



జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు దోమల బెడద నివారణ చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హెచ్ఎంటి చెరువులోని గుర్రపుడెక్క పూర్తిగా నిండిపోయినందు వలన దానివల్ల దోమలు విపరీతంగా విజృంభిస్తున్నాయని ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని వెంటనే గుర్రపుడెక్కును తొలగించి చర్యలు చేపట్టాలని స్థానిక నాయకులు కమిషనర్ కు వివరించారు. జి హెచ్.ఎం.సి డిపార్ట్మెంట్ ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్రపు డెక్కన్ తొలగించి చర్యలు చేపట్టే




వారు, కానీ సెప్టెంబర్ మాసం నుండి ఎంటమాలజీ డిపార్ట్మెంట్ కనుమరుగైందని యాంటీ లార్వా ప్రోగ్రాంలు ఏర్పాటు చేసే వారని గుర్రపుడెక్కను మూడు నెలలకు ఒకసారి తొలగించేవారని అయినప్పటికీ దాని వలన దోమలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సాయంత్రం ఐదు దాటితే ప్రజలు వీధుల్లో నిలబడే పరిస్థితి లేదని దోమల తీవ్రత అతిగా ఉందని అన్నారు. వాటి వలన విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలకు దోమల బెడద లేకుండా నివారణ చర్యలు కల్పించాలని కమిషనర్ వివరించగా అతి త్వరలో దోమల నివారణకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు జోనల్ కమిషనర్ను కలిసి త్వరగా నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. జిహెచ్ఎంసి కాలనీలా దోమల నివారణకు ఫాగింగ్ సిస్టం కనీసం కానరాకుండా కనబడుతుందని, ఫాకింగ్ మిషిన్లు ,స్ప్రే మిషిన్లు అందుబాటులో లేవని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దోమల వల్ల అనేక ఇబ్బందులు ఎదురుకుంటున్నాం.దోమల వల్ల బంధువులు స్నేహితులు ఇంటికి రావాలి అంటే జంకుతున్నారు.విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

-చేలగోని కిష్టయ్య గౌడ్.
స్థానిక ఉప్పల్ గణేష్ నగర్ నివాసి.



## కాంగ్రెస్‌వన్నీ అబద్దాలు..మోసపూరిత మాటలే.

- రెండేళ్లలో ఏం చేసిండ్లో ఆలోచన చేయాలి.
- మానిఫెస్టో రాసి మర్చిపోయిన మంథని ఎమ్మెల్యే.
- మంథని సమగ్రాభివృద్ది కోసమే తమ ఆరాటం.
- బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి.
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.

**జనం వాయిస్, మంథని:**

అధికారం...పదవుల కోసం కాంగ్రెస్ అబద్దాలు, మోసపూరిత మాటలతో మోసం చేస్తారని, నమ్మి మోసపోతే గోసపడుతామని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బాగంగా శనివారం మంథని పట్టణంలోని గాంధీ చౌక్ ఏరియా,7,8,9 వ వార్డుల్లో ఆయా వార్డుల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస పార్టీ నాయకులేనని గమనించాలన్నారు. అనేక మార్లు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని ఆయన గుర్తు చేశారు. గత అసెంబ్లీ




ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అభివృద్ధి చేస్తామంటూ ప్రగల్బాలు పలికిన నాయకులు ఈ రెండేళ్ల కాలంలో ఏం చేశారని ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికలు, ఓట్లు వస్తేనే ప్రజలు గుర్తుకు వస్తారని ఆయన విమర్శించారు. ఆనాడు మున్సిపల్ ఎన్నికల సమయంలో మంథని ఎమ్మెల్యే మంథని అభివృద్ధికి మానీఫెస్టో తయారు చేసి మర్చిపోయాడని, మంథని ప్రజలతో పాటు యావత్ తెలంగాణ ప్రజలను మానీఫెస్టో పేరుతో మోసం చేశాడని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని, ఓట్ల కోసం వచ్చే నాయకులకు కాంగ్రెస్ బాకీ కార్డులను చూపించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల కాలంలో మంథని ఎంత అభివృద్ధి చెందిందో బేరీజు వేసుకోవాలని, పట్టణ సమగ్రాభివృద్ధి కోసమే ఆరాటపడుతున్నామని ఆయన అన్నారు. కాంగ్రెస్‌కు అవకాశం కల్పిస్తే ఇండ్ల కూల్చివేతలను, పర్మిషన్‌లకు కమీషన్‌లు తప్ప అభివృద్ధి అనేది ఉండదన్నారు. ఆనాడు ప్రతి గల్లీకి సీసీ రోడ్లు , అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు శ్రీకారం చుట్టిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. మంథని మున్సిపాలిటీ లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగిరితేనే ప్రజలకు ప్రయోజనం ఉంటుందని, అవినీతిరహిత పాలనను అందిస్తామని ఆయన ఈ సందర్బంగా హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని పట్టణ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఆయన ఈ సందర్బంగా ప్రజలకు పిలుపునిచ్చారు.

## ప్రతిభ పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపిక.

**-గాయత్రి విద్యానికేతన్ విద్యార్థికి పలువురు అభినందనలు.**

**జనం వాయిస్, పెద్దపల్లి:**

ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన డిస్టిక్ లెవెల్ ప్రతిభ పోటీలో చిత్రలేఖనం (డ్రాయింగ్) పోటీల్లో గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని నూర్ ఫాతిమా మొదటి బహుమతి సాధించింది .ఈనాడు మేనేజర్ యంగర్ రెడ్డి మరియు కిమ్స్ ఇన్స్టిట్యూషన్ చైర్మెన్ రవీంద్రరావు బహుమతి అందజేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీవ్ర పోటీ మధ్య నూర్ ఫాతిమా ప్రతిభను చాటి, ఫస్ట్ ప్రైజ్ గెలుచుకొని గాయత్రి విద్యానికేతన్‌కు గర్వకారణంగా నిలిచిందని, ఈ సందర్భంగా నూర్ ఫాతిమాను గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ & కరెస్పాండెంట్ రజినీదేవి , ఉపాధ్యాయ బృందం,




తల్లిదండ్రులు హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థులలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయడంలో ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా నూర్ ఫాతిమా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి-అభివృద్ధికి పట్టం కట్టండి.
- ఎన్నికల ప్రచారం లో మంత్రులు తుమ్మల,పొన్నం, ఎమ్మెల్యే నవీన్,ఇంచార్జి ప్రణవ్.



**జనం వాయిస్, హుజూరాబాద్:**

హుజూరాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,హుజూరాబాద్ జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో మంచి మెజారిటీతో విజయం సాధించబోతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ,రవాణా



శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని డిసిఎంఎస్ కాంప్లెక్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కార్నర్ మీటింగ్ లో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోపే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్ సౌకర్యాన్ని,గృహాలక్ష్మి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్,కలలు నిజం చేసే ఇందిరమ్మ ఇళు ,,పేదల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వంగా పేదలకు ఉచిత సన్న బియ్యాన్ని అందజేశామని ఇలాంటి సంక్షేమ పథకాలతో దేశంలోనే సంక్షేమ పథకాలను అమలులో ఆదర్శంగా నిలిచామని,ఇలాంటి పని చేసే ప్రభుత్వాన్ని ప్రజలు రాష్ట్రం అంతటా అన్ని ఎన్నికల్లో ఆదరిస్తున్నారని అన్నారు.రాబోయే కాలంలో హుజూరాబాద్,జమ్మికుంట మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తే మరిన్ని నిధులు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని,మిగిలిందల్లా అభ్యర్థుల గెలుపే మిగిలిందని అన్నారు.నియోజకవర్గ ఇంచార్జిగా ప్రణవ్ మంచి పనులు చేస్తున్నాడని,ఇక్కడి ఎమ్మెల్యే చిల్లర వేషాలతో హుజూరాబాద్ అభివృద్ధికి విరోధకుడిగా నిలుస్తున్నాడని అన్నారు.గతంలో ఎంపీ గా ఈ ప్రాంతానికి సేవ చేసిన వ్యక్తిగా ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.రాబోయే 3 ఏళ్లలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ నుండి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# గడపగడపకు 29వ వార్డు బొరగాల ప్రవీణ్ ప్రచారం.

**-ప్రచారంలో పవన్ కళ్యాణ్ ఆశయాలు,సిద్ధాంతాల వివరణ.**

**జనం వాయిస్,హుజురాబాద్:**

హుజురాబాద్ మున్సిపాలిటీ 29వ వార్డ్ జనసేన పార్టీ అభ్యర్థి బోరాగాల ప్రవీణ్ గడపగడపకు ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తానని తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని బోరగాల ప్రవీణ్ కోరారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలు తాను ఆచరిస్తూ ,వివరిస్తూ ప్రతి గడపగడపకు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది గెలిచిన అదే పార్టీలో ఉంటారనేది నమ్మకం లేదు తాను గెలిస్తే మాత్రం జనసేన పార్టీల్నీ ఉంటానని సమస్యల మీద పోరాడుతానని హామీ ఇస్తున్నాడు. నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడతానని 29వ ప్రజలకు నమస్కరించి ఓటు అభ్యర్థిస్తున్నాడు. డబ్బులకు ఆశపడి ఐదు సంవత్సరాలు వార్డును ఆగమాగం చేయకుండా నన్ను నమ్మి ఓటు వేయగలరని, గెలిస్తే మీకు ఏ సమస్య ఉన్నా నేను ముందుండి ఆ సమస్యకు పరిష్కారం అయ్యే విధంగా చేస్తానని మాట ఇచ్చి ఆ మాట ప్రకారం నిలబడతానని ప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు పల్లె మహేష్ గౌడ్, దేవి శ్రీనివాస్, గట్టు నారాయణ గౌడ్ మరియు సంతోష్,తిరుపతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి.

- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి ౦ కౌశిక్ రెడ్డి.
- హుజురాబాద్ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు దిశా నిర్దేశం.

**జనం వాయిస్, హుజూరాబాద్ :**

బీఆర్ఎస్ కెసిఆర్ పాలనలో రాష్ట్ర అభివృద్ధికి పునాది వేసిన పాలన అని, హుజురాబాద్ నియోజకవర్గంలో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు.శనివారం హుజరాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి 3వ వార్డు, 2వ వార్డు లలో అభ్యర్థులకు మద్దతుగా జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హుజురాబాద్ ప్రాంత ప్రజలు స్వయంగా చూసినట్లుగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సరఫరా, రహదారులు, మున్సిపల్ మౌలిక వసతులు, పేదల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యాయని పేర్కొన్నారు.రైతుబంధు, రైతు బీమా, కంటి వెలుగు, కెసిఆర్ కిట్టు,వృద్ధులువితంతువులువికలాంగులకు



పెన్షన్లు, కళ్యాణ లక్ష్మిషాదీ ముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు భరోసాగా నిలిచాయని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో తీవ్ర గందరగోళం నెలకొందని, రైతులకు పూర్తి తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు.సంక్షేమ పథకాలు అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు.ప్రజలు కోరుకున్న అభివృద్ధి కాకుండా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందనిఆరోపించారు.హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలకు బీఆర్ఎస్ పాలనలోనే శాశ్వత పరిష్కారాలు జరిగాయని, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చామని పాడి కౌశిక్ రెడ్డి గుర్తు చేశారు.గత మున్సిపల్ చైర్మన్ గా ఉన్న గందె రాధిక శ్రీనివాస్ హుజరాబాద్ పట్టణంలో కోట్లాది రూపాయలతో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేది, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేసారు.హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, కేసీఆర్ నాయకత్వంపై మరోసారి విశ్వాసం ప్రకటించాలని హుజురాబాద్ ప్రజలకు పాడి కౌశిక్ రెడ్డి పేరుపేరునా విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన అన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానం.

## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**జనం వాయిస్, పెద్దపల్లి:**



సమాచార ,పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో 202628 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు 28-02-2026 తో ముగియనున్నందున, అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం సమాచార మరియు ప్రజాసంబంధాల కమిషనర్, హైదరాబాద్ వారికి పంపించాలని సూచించారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి సమర్పించాలన్నారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార ,పౌర సంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిల జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డు కోసం ఆన్ లైన్ దరఖాస్తుల సమర్పణ తేదీ 09-02-2026 నుంచి ప్రారంభం అవుతుందని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుడిగె శ్రీకాంత్

**జనం వాయిస్,జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బుడిగె శ్రీకాంత్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని, గత రెండేళ్ల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు ఉండాలని శ్రీకాంత్ కోరారు.అధికారంలో లేని పార్టీలకు ఓటు వేస్తే ఓటు వృధా అవుతుందని, అభివృద్ధి కుంటు పడుతుందని శ్రీకాంత్ అన్నారు. ప్రజా ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళు _న్నామని, ప్రజా పాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఏక కాలంలో రైతు రుణమాఫీ, ప్రతి పంటకు రైతు భరోసా, పంట బోనస్ లాంటి అనేక పథకాలను ప్రజలకు అందిస్తున్నా కాంగ్రెస్ పార్టీ వైపే ప్రజలు ఉన్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ పథకాలతో పాటు 9 వ వార్డుకు సంబంధించి, 12 సూత్రాల హామీలను ప్రకటించి శ్రీకాంత్ ముందుకు వెళ్తున్నారు. ఈ ప్రచారంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి.

## – జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి మండల రవీందర్.

**జనం వాయిస్, మంథని:**



వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి మండల రవీందర్ అన్నారు.



శనివారం మంథని పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ప్రభుత్వ కళాశాల బాలుర హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్ లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల సంక్షేమ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ముఖ్యంగా 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆయన సూచించారు. విద్యార్థుల కోసం సాయంత్రం ట్యూటర్లతో ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హాస్టల్ సంక్షేమ అధికారులు తిరుపతి, ప్రశాంత్, జీవన్, రమేష్, రమ్య లు ఉన్నారు.

# తూప్రాన్ అభివృద్ధి గుర్తు చేసుకోండి

- మాజీ మంత్రి హరీష్ రావు.
- రోడ్ షోతో హోరెత్తిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం.
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు.
- బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపు.



**జనం వాయిస్, తూప్రాన్:**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తూప్రాన్ మున్సిపాలిటీలో పర్యటించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. శనివారం అల్లాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన ఆయన, అక్కడి నుంచి తూప్రాన్ బస్టాండ్ వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ తూప్రాన్ అభివృద్ధిని గుర్తు చేస్తూ ప్రజలను ఆలోచించాలన్నారు. ఒకప్పుడు తూప్రాన్‌లో మూడు రోజులకోసారి మాత్రమే మంచినీరు వచ్చేదని, అప్పట్లో గీతారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బిందెలతో అడ్డం పడి ప్రజలు నిరసనలు తెలిపిన పరిస్థితులు ఉన్నాయని హరీష్ రావు గుర్తు చేశారు. కానీ కేసీఆర్ వచ్చాక ప్రతి ఇంటికి నల్లా ఏర్పాటు చేసి ఆడబిడ్డల నీళ్ల కష్టాలు తీర్చారని అన్నారు. తూప్రాన్‌ను మున్సిపాలిటీ చేయడం, ఆర్డీవో కార్యాలయం తీసుకురావడం, ఫోర్ లైన్ రోడ్లతో పట్టణాన్ని హైవేలా మార్చింది కారు గుర్తే అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రాకముందు తూప్రాన్‌కు పిల్లనివ్వాలంటే నీళ్లు మోపిస్తారనే భయం ఉండేదని, ఇప్పుడు తూప్రాన్‌కే పిల్లనివ్వాలనుకునే పరిస్థితి వచ్చిందన్నారు. పది లక్షలు లేని భూమిని కోటి రూపాయల విలువకు తీసుకువచ్చింది కేసీఆర్ పాలనేనని చెప్పారు. అయితే రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు పాతాళానికి పడిపోయి, బంగారం ధరలు ఆకాశానికి చేరాయని విమర్శించారు. తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, నర్సారెడ్డిమైనంపల్లి మధ్య పోరులో ప్రజలను బలి చేస్తున్నారని ఆరోపించారు. "మీకు ఆధిపత్య రాజకీయాలు కావాలా? లేక అభివృద్ధి కావాలా?" అని ప్రజలను ప్రశ్నించారు. రెండేళ్లుగా తూప్రాన్ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని, రోడ్లపై గుంతలు పడ్డా డాంబర్ వేసే దిక్కు లేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో పంట పంటకు రైతుబంధు అందేదని, కరోనా కష్టకాలంలో కూడా ఆపలేదని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి రెండు రైతుబంధులు ఎగ్గొట్టారని, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, గొర్రెల పంపిణీ, చేప పిల్లలు, దళిత బంధు అన్నీ బంద్ పెట్టి ప్రజలను గోస పెడుతున్నారని విమర్శించారు. "సద్ది తిన్న రేవు తలవాలి.. మనకు అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోవద్దు" అని పిలుపునిచ్చారు. బీజేపీపై కూడా విమర్శలు చేసిన హరీష్ రావు, తూప్రాన్‌కు ఒక్క హాస్పిటల్ అయినా కట్టించారా? కల్యాణ లక్ష్మి ఇచ్చారా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వలేదని, పువ్వు గుర్తుకు ఓటేసినా, ఓటును మోరీలో వేసినా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు అడిగితే సీఎం మాట్లాడే భాష సరికాదని, ఇలాంటి ముఖ్యమంత్రికి ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల కోసం కౌన్సిలర్లను గెలిపించాలన్నారు. రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ, తూప్రాన్ అభివృద్ధి బాధ్యత తనదేనని, ఏ పని ఉన్నా చేసి పెడతానని హరీష్ రావు ప్రజలకు భరోసా ఇచ్చారు.

# సమవేశి అజీవిక యోజన అమలుపై వీడియో సమావేశం

- సెర్ప్ సీఈఓ దివ్య ఆధ్వర్యంలో సమీక్ష.
- కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు పాల్గొనడం.
- పథకం అమలుకు కార్యాచరణపై చర్చ.

**జనం వాయిస్, ఆదిలాబాద్:**

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న సమవేశి అజీవిక యోజన పథకం అమలుపై శనివారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈఓ డి. దివ్య ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమవేశి అజీవిక యోజన లక్ష్యాలు, లబ్ధిదారుల ఎంపిక, పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపు, ఆర్థిక స్వావలంబన దిశగా ఈ పథకం కీలకంగా నిలవనున్నదని అధికారులు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై చర్చించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ పటిష్టం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



# తొర్రూర్‌ను నందనవనంగా తీర్చిదిద్దుతా.

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.
- వర్ధన్నపేటకు అదనంగా పది ౧ కోట్లు.
- రోడ్ షోలు, కార్నర్ మీటింగ్లతో జోరుగా ప్రచారం.
- హస్తం గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు.
- అభివృద్ధి, సంక్షేమ హామీలపై స్పష్టత.



**జనం వాయిస్, తొర్రూర్ / వర్ధన్నపేట:**

తాను దత్తత తీసుకున్న తొర్రూర్ మున్సిపాలిటీ పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతానని, వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి కోసం అదనంగా పది కోట్ల రూపాయలు మంజూరు చేయిస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఉదయం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీల్లో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, నాగరాజు, పీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న వార్డు అభ్యర్థులు, మిత్రపక్ష సీపీఐ నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్ల ద్వారా ప్రజలను కలుసుకుని ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తొర్రూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న బినామీ కాంట్రాక్టర్ నిర్వాకం వల్ల అనేక అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా మిగిలిపోయాయని మంత్రి విమర్శించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆ కాంట్రాక్టును రద్దు చేయడమా, లేక పనులు పూర్తిచేయించడమా అన్న పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు. అలాగే వర్ధన్నపేట పట్టణ అభివృద్ధికి అదనంగా పది కోట్ల రూపాయలు మంజూరు చేయించే బాధ్యతను కూడా తానే భరిస్తానని తెలిపారు. మున్సిపాలిటీలో కలిపిన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయిస్తానని, తన సొంత నిధులతో ఎల్లమ్మ గుడి నిర్మాణం చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని గుర్తు చేశారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. అరుదైన పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తనదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రెండో విడత ఏప్రిల్‌లో ప్రారంభమవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఇంకా మూడు విడతల్లో అర్హులైన ఆడబిడ్డలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ప్రజలంతా ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ, తొర్రూర్, వర్ధన్నపేట పట్టణాల అభివృద్ధి బాధ్యత తమదేనని భరోసా ఇచ్చారు.



# మున్సిపల్ ఎన్నికలకై పకడ్బందీ ఏర్పాట్లు

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్.
- ఎన్నికల ముందు నుంచే కట్టుదిట్టమైన చర్యలు.
- అక్రమ మద్యం, తాయిలాలపై నిఘా.
- ఎన్నికలుకౌంటింగ్ వరకు భారీ బందోబస్తు.




**జనం వాయిస్, వరంగల్:**

మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలంటూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశించారు. ఈ నెల 11వ తేదీన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, ఘన్‌పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీలకు జరిగే ఎన్నికల నేపథ్యంలో శనివారం కమిషనరేట్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలపై సంబంధిత పోలీస్ అధికారులు వివరించారు. ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, అలాగే కౌంటింగ్ రోజున చేపట్టనున్న బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ, అక్రమ మద్యం కట్టడి చేయడంతో పాటు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే తాయిలాల పంపిణీపై కఠిన నిఘా పెట్టాలని ఆదేశించారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాల పంపిణీ నుంచి ఎన్నికల రోజు, కౌంటింగ్ వరకు పెద్ద సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించేలా పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సీపీ తెలిపారు. అలాగే పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, ఏఎస్పీలు శుభం, చేతన్, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రాతో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు ప్రయాణంపై ప్రతిపక్షాల రాద్ధాంతం సరికాదు.

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.

**జనం వాయిస్, సంగారెడ్డి:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఉచిత బస్సు పథకం అమలుతో మహిళలు ఘర్షణలకు దిగుతున్నారంటూ ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. అరవై సీట్లు ఉన్న బస్సులో వంద మంది ఎక్కితే గొడవలు జరగడం సహజమేనని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ఈ అంశాన్ని రాజకీయం చేయడం సరికాదని జగ్గారెడ్డి అన్నారు. బియ్యం తక్కువగా ఉన్నా తినేవాళ్లు ఎక్కువగా ఉన్న పరిస్థితిలా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత బలంగా లేకపోయినా, ప్రభుత్వం క్రమంగా అన్ని హామీలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అభివృద్ధి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఒక్కో వార్డుకు ఎనిమిది కోట్ల రూపాయలు మంజూరు చేయిస్తానని తెలిపారు. సంగారెడ్డిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే మొత్తం మూడు వందల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు తీసుకువస్తానని జగ్గారెడ్డి చెప్పారు. రెండు వేల పదమూడు సంవత్సరంలో ఐదువేల ఐదు వందల మందికి ఇంటి స్థలాలు ఇచ్చానని గుర్తు చేశారు. గత పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇంటి స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేస్తుందని ప్రకటిస్తూ, తాను కాంగ్రెస్ పార్టీ కోసం తెలంగాణ అంతా తిరుగుతానని తెలిపారు.

దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# అర్ధ శతకంతో చెలరేగిన హెట్‌మైర్. స్కాట్లాండ్ బోణీ కొట్టేనా..?



**జనం వాయిస్, స్పోర్ట్స్:**

టీ20 ప్రపంచకప్ తొలి లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాటర్లు దూకుడు ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా స్కాట్లాండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైర్ అద్భుత అర్ధశతకంతో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. పవర్ హిట్టింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా పేరొందిన హెట్‌మైర్ తనదైన శైలిలో సిక్సర్ల వర్షం కురిపిస్తూ స్కాట్లాండ్ బౌలర్లను ఉతికేశాడు. ఐపీఎల్‌లో సంపాదించిన అనుభవాన్ని పూర్తిగా ఉపయోగించుకుని, కీలక సమయంలో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు బ్రాండన్ కింగ్, షాయ్ హోప్ మంచి ఆరంభం అందించారు. కింగ్ ఆరంభంలోనే దూకుడుగా ఆడుతూ పవర్‌ప్లేలో పరుగుల రేటును పెంచాడు. మరోవైపు షాయ్ హోప్ ఓపికగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. అయితే హోప్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన షిమ్రాన్ హెట్‌మైర్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. తొలి బంతినే గాల్లోకి లేపి రిస్క్ తీసుకున్నా, ఆపై వరుస బౌండరీలు, భారీ సిక్సర్లతో స్కాట్లాండ్ బౌలింగ్‌ను చిత్తుచేశాడు. హెట్‌మైర్ కేవలం 22 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసి, ప్రపంచకప్‌లో వెస్టిండీస్ తరఫున వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. మరో ఎండ్‌లో రొవ్‌మన్ పావెల్ కూడా ధనాధన్ ఆడుతూ హెట్‌మైర్‌కు చక్కని సహకారం అందించాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పి స్కోర్‌బోర్డును వేగంగా ముందుకు నడిపించారు. పావెల్ ఔటైనప్పటికీ విండీస్ దూకుడు తగ్గలేదు. డెత్ ఓవర్లలో షెర్ఫానే రూథర్‌ఫోర్డ్ మెరుపు ఇన్నింగ్స్‌తో పరుగుల వేగాన్ని మరింత పెంచాడు. చివరి ఓవర్‌లో రొమారియో షెఫర్డ్ భారీ షాట్‌తో స్కోర్‌ను మరింత బలపరిచాడు. నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి వెస్టిండీస్ ఐదు వికెట్ల నష్టానికి 182 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఈడెన్ గార్డెన్స్ లాంటి బ్యాటింగ్‌కు అనుకూలమైన మైదానంలో ఈ లక్ష్యం స్కాట్లాండ్‌కు పెద్ద పరీక్షగా మారనుంది. వరల్డ్‌కప్‌లో తొలి మ్యాచ్‌లోనే భారీ స్కోర్ సాధించిన విండీస్ బ్యాటింగ్ లైనప్ తమ ఉద్దేశాన్ని స్పష్టంగా చాటింది. హెట్‌మైర్ దూకుడు, కింగ్ ఇచ్చిన శుభారంభం, చివర్లో రూథర్‌ఫోర్డ్ చేసిన ఫినిషింగ్‌తో విండీస్ ఈ మ్యాచ్‌లో ఆధిపత్యం సాధించింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో స్కాట్లాండ్ బ్యాటర్లు ఎంతవరకు పోరాడగలరో అన్నది ఆసక్తికరంగా మారింది.



# కుర్రాళ్లు అదుర్స్.. ప్రొఫెషనల్స్‌లా ఆడారు..

## యువ భారత్‌పై రవిశాస్త్రి ప్రశంసల వర్షం..!

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

అండర్-19 ప్రపంచకప్ 2026ను భారత యువ క్రికెట్ జట్టు కైవసం చేసుకోవడంతో దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది. హరారే వేదికగా జరిగిన ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించి ఆరోసారి విశ్వవిజేతగా నిలిచిన యంగ్ ఇండియా ఆటతీరుపై భారత క్రికెట్ దిగ్గజం రవిశాస్త్రి ప్రశంసల వర్షం కురిపించాడు. గెలుపే కాదు.. మ్యాచ్ అంతా వారు ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం, పరిణితి తనను ఎంతగానో ఆకట్టుకుందని వ్యాఖ్యానించాడు. క్లిష్ట పరిస్థితుల్లోనూ యువ ఆటగాళ్లు తడబడకుండా నిలకడగా ఆడారని రవిశాస్త్రి కొనియాడాడు. ఒత్తిడి ఎక్కువగా ఉన్న ఫైనల్ మ్యాచ్‌లోనూ అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్ క్రికెటర్లలా వ్యవహరించారని కితాబిచ్చాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. మూడు విభాగాల్లోనూ జట్టు సమష్టిగా రాణించడం విజయంలో కీలకంగా నిలిచిందని పేర్కొన్నాడు. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో యువ ఆటగాళ్లు చూపించిన క్రమశిక్షణ, మ్యాచ్‌పై పట్టును చూసి తాను ఆశ్చర్యపోయానని వెల్లడించాడు. జట్టులోని ప్రతి ఆటగాడు జట్టు కోసం ఆడిన తీరు ఈ యువ జట్టుకు ఉన్న ఐక్యతను ప్రతిబింబిస్తుందని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఒకరి కోసం ఒకరు ఆడే తత్వమే ఛాంపియన్ జట్ల లక్షణమని, అదే ఈ అండర్-19 భారత జట్టులో స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నాడు. యువ వయసులోనే ఇంత పరిపక్వత చూపించడం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు గొప్ప సంపదగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. తన సోషల్ మీడియా వేదికగా స్పందించిన రవిశాస్త్రి, "ప్రతిభ మిమ్మల్ని గుర్తింపు పొందేలా చేస్తుంది.. కానీ మిమ్మల్ని ముందుకు నడిపించేది మీ టెంపర్‌మెంట్ మాత్రమే" అంటూ యువ ఆటగాళ్లను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. ఈ జట్టులో ప్రతిభతో పాటు అద్భుతమైన మానసిక దృఢత్వం కూడా పుష్కలంగా ఉందని ప్రశంసించాడు. ఈ విజయాన్ని పూర్తిగా ఆస్వాదించాలని యువ క్రికెటర్లకు సూచించిన రవిశాస్త్రి.. ఇది వారి కెరీర్‌లో కేవలం తొలి అధ్యాయం మాత్రమేనని పేర్కొన్నాడు. రాబోయే రోజుల్లో భారత క్రికెట్‌లో ఈ యువ ఆటగాళ్ల పేర్లు తరచూ వినిపిస్తాయని, సీనియర్ జట్టుకు కూడా వీరు భవిష్యత్తులో కీలక స్థంభాలుగా మారతారని ధీమా వ్యక్తం చేశాడు. యువ భారత్ సాధించిన ఈ ఘన విజయం దేశానికి గర్వకారణంగా నిలిచిందని, భారత క్రికెట్ భవిష్యత్తు భరోసాగా ఉందని అభిమానులు భావిస్తున్నారు




# అఫ్గాన్ మహిళా క్రికెటర్లకు అండగా రషీద్ ఖాన్

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

పురుషుల టీ20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌కు ముందు అఫ్గనిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో సంచలనం రేపాయి. ప్రభుత్వ ఆంక్షల కారణంగా విదేశాల్లో శరణార్థులుగా జీవిస్తున్న అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు తాను పూర్తిగా మద్దతిస్తున్నానని రషీద్ ఖాన్ బహిరంగంగా ప్రకటించాడు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించిన ఆయన.. మహిళా క్రికెటర్లు మళ్లీ మైదానంలోకి రావాలని తాను కోరుకుంటున్నానని స్పష్టం చేశాడు. గత ఐదేళ్లుగా అఫ్గనిస్థాన్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల కారణంగా మహిళలపై తీవ్రమైన ఆంక్షలు అమలవుతున్నాయి. చదువు, ఉపాధి, క్రీడలపై పరిమితులు విధించడంతో అనేక మంది మహిళా క్రికెటర్లు దేశం విడిచి విదేశాల్లో ఆశ్రయం పొందుతున్నారు. కొందరు తమ క్రికెట్ కలలను పక్కన పెట్టి జీవనోపాధి కోసం పోరాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మహిళా క్రికెటర్లకు మద్దతు తెలపాలని ఇటీవల ఫిరూజా అమిరి వంటి ఆటగాళ్లు అఫ్గనిస్థాన్ పురుష క్రికెటర్లను కోరారు. ఈ నేపథ్యంతోనే రషీద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అఫ్గనిస్థాన్ మహిళల జట్టు కచ్చితంగా ఆడాలని, వారికి అంతర్జాతీయ గుర్తింపు రావాలని రషీద్ ఖాన్ స్పష్టంగా పేర్కొన్నాడు. అఫ్గనిస్థాన్ పూర్తి సభ్యత్వం కలిగిన దేశం కాబట్టి మహిళా జట్టుకూ ఆ హక్కు దక్కాలని ఆయన అభిప్రాయపడ్డాడు. ఏ వేదికపై అయినా అఫ్గనిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించే ఆటగాళ్లు కనిపిస్తే అది దేశానికి గర్వకారణమేనని పేర్కొన్నాడు. అయితే ఈ అంశంపై తుది నిర్ణయం అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు, అంతర్జాతీయ క్రికెట్ మండలి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. ఆటగాళ్లుగా తమ చేతుల్లో ఉన్నది పరిమితమేనని, అధికార వర్గాలు ముందడుగు వేస్తేనే పరిస్థితుల్లో మార్పు సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇదిలా ఉండగా.. శరణార్థులుగా విదేశాల్లో నివసిస్తున్న అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు ఐసీసీ ఇప్పటికే కొన్ని కీలక చర్యలు చేపట్టింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించిన వన్డే ప్రపంచకప్ సందర్భంగా మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించింది. అలాగే బీసీసీఐ, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు, ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు సహకారంతో మహిళా క్రికెటర్లకు శిక్షణ శిబిరాలు, దేశవాళీ స్థాయి మ్యాచ్‌ల్లో పాల్గొనే అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రయత్నాలు భవిష్యత్‌లో అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు మళ్లీ అంతర్జాతీయ వేదిక దక్కేందుకు మార్గం సుగమం చేస్తాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# యువ భారత్‌పై కాసుల వర్షం.

## - విశ్వవిజేతలకు బీసీసీఐ రూ.7.5 కోట్ల నజరానా..!

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

అండర్-19 ప్రపంచకప్ 2026లో భారత యువ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. హరారే వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి రికార్డు స్థాయిలో ఆరోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఈ చారిత్రక విజయంతో దేశవ్యాప్తంగా సంబరాలు వెల్లువెత్తగా, విజేతలపై బీసీసీఐ కాసుల వర్షం కురిపించింది. ప్రపంచ విజేతలైన యువ భారత్ జట్టు కోసం భారీ నగదు బహుమతిని ప్రకటిస్తూ బీసీసీఐ రూ. 7.5 కోట్ల నజరానాను ప్రకటించింది. ఈ నగదు బహుమతిని విజేత జట్టు ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, సహాయక సిబ్బంది మరియు సెలక్షన్ కమిటీకి పంచనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ఒక్కో విభాగానికి ఎంత మొత్తం కేటాయించాలన్న వివరాలను త్వరలో ఖరారు చేస్తామని పేర్కొన్నారు. యువ క్రికెటర్ల అద్భుత ప్రదర్శనకు ఇది తగిన గుర్తింపేనని బీసీసీఐ పెద్దలు వ్యాఖ్యానించారు. దేశీయ స్థాయిలో ప్రతిభను గుర్తించి పెంపొందించే వ్యవస్థ బలంగా ఉండటంతోనే ఈ స్థాయి ఫలితాలు వస్తున్నాయని సైకియా ప్రశంసించారు. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు సాధించింది. కేవలం 14 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర శతకంతో ఇంగ్లండ్ బౌలర్లను బెంబేలెత్తించాడు. అతడి దూకుడైన ఇన్నింగ్స్ భారత్ భారీ స్కోరు సాధించడంలో కీలకంగా నిలిచింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే బాధ్యతాయుతమైన అర్ధశతకంతో జట్టుకు పటిష్టమైన పునాది వేశాడు. వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు కూడా కీలక సమయంలో మెరుపులు మెరిపించి పరుగులు జోడించాడు. భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేక కుప్పకూలింది. మిడిల్ ఆర్డర్ పూర్తిగా విఫలమవ్వడంతో మ్యాచ్ భారత్ వైపు తేలిపోయింది. ఇంగ్లండ్ బ్యాటర్ కాలెబ్ ఫాల్కనర్ శతకం సాధించినప్పటికీ, ఇతరుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో జట్టు పరాజయం తప్పలేదు.



భారత బౌలర్లు కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కట్టడి చేసి చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో భారత్ అరుదైన ఘనతను కూడా సాధించింది. ప్రస్తుతం అండర్-19 పురుషుల ప్రపంచకప్‌తో పాటు అండర్-19 మహిళల ప్రపంచకప్ టైటిళ్లు రెండూ భారత్ ఖాతాలోనే ఉన్నాయి. యువస్థాయిలో భారత క్రికెట్ ఆధిపత్యాన్ని చాటుతున్న ఈ ఫలితాలు, భవిష్యత్తులో సీనియర్ జట్టుకు బలమైన ఆటగాళ్లను అందించే దిశగా కీలకంగా మారనున్నాయని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ అద్భుత విజయం వెనుక పటిష్టమైన దేశీయ క్రికెట్ నిర్మాణం, అకాడమీలు, కోచింగ్ వ్యవస్థలు, ప్రతిభను తొలిదశలోనే గుర్తించే విధానం ప్రధాన కారణాలని బీసీసీఐ పెద్దలు పేర్కొన్నారు. యువ భారత్ సాధించిన ఈ ఘనత దేశానికి గర్వకారణంగా నిలిచిందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలకు ఇది బాటలు వేస్తుందని క్రికెట్ అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# పవన్ కళ్యాణ్ సినిమాలో ఫౌజీ భామ ఇమాన్వి..?

జనం వాయిస్, సినిమా:

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్  సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పవన్ కళ్యాణ్ సినిమాలు అంటే మాస్ ఎలిమెంట్స్‌తో పాటు దేశభక్తి, పవర్‌ఫుల్ పాత్రలు ఉంటాయన్న అంచనా ఉంటుంది. ఈ నేపథ్యంలో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ కొత్త చిత్రం మరింత భారీ స్థాయిలో ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఉగాది నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తయినట్లు, పవన్ కళ్యాణ్ పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉండబోతుందని టాక్ నడుస్తోంది. ఈ సినిమా హీరోయిన్ ఎంపికపై తాజాగా సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. 'ఫౌజీ' అనే సిరీస్‌తో పాపులారిటీ సంపాదించిన యంగ్ బ్యూటీ ఇమాన్వి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుందన్న ప్రచారం తెరపైకి వచ్చింది. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఇమాన్వి తక్కువ కాలంలోనే భారీ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఆమె డిఫరెంట్ లుక్, కాన్ఫిడెంట్ ప్రెజెన్స్ యువతలో క్రేజ్ తెచ్చిపెట్టింది. ఇప్పటికే బాలీవుడ్, సౌత్ ఇండస్ట్రీలో కొన్ని పెద్ద ప్రాజెక్ట్స్‌కు ఆమె పేరు పరిశీలనలో ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు పవన్ కళ్యాణ్ సినిమాలో ఆమె పేరు వినిపించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. పవన్ కళ్యాణ్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని అభిమానులు భావిస్తారు. గతంలో కూడా పవన్ సరసన నటించిన హీరోయిన్లు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఇమాన్వి ఎంపిక నిజమైతే ఆమె కెరీర్‌కు ఇది పెద్ద టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సురేందర్ రెడ్డి స్టైల్‌లో ఉండే పవర్‌ఫుల్ కథనంలో హీరోయిన్ పాత్ర కూడా బలంగా ఉండే అవకాశం ఉందని టాక్. ఫౌజీ నేపథ్యంతో ఉన్న కథలో ఇమాన్వి పాత్రకు కీలక ప్రాధాన్యం ఉంటుందని సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఊహాగానాలు చేస్తున్నారు.అయితే ఇప్పటివరకు ఈ విషయంలో చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. హీరోయిన్ ఎంపికపై అనేక పేర్లు వినిపిస్తున్నా, చివరకు ఎవరు ఫైనల్ అవుతారన్నది ఇంకా క్లారిటీ లేదు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నట్లు సమాచారం. షూటింగ్ ప్రారంభానికి ముందే హీరోయిన్, ఇతర కీలక నటీనటుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు పవన్ కళ్యాణ్ ప్రస్తుతం 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమా 26న విడుదలకు సిద్ధంగా ఉంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల తర్వాత పవన్ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్‌లో జాయిన్ అవుతారని సమాచారం. వరుసగా భారీ సినిమాలు చేస్తూ అభిమానులను ఉత్సాహంలో ఉంచుతున్న పవన్ కళ్యాణ్, సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో వచ్చే చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తానికి పవన్ కళ్యాణ్ సినిమాలో ఫౌజీ భామ ఇమాన్వి నటిస్తుందన్న వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ప్రచారానికి చిత్రబృందం నుంచి అధికారిక ముద్ర పడితే, ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అభిమానులు మాత్రం ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఓటీటీలోకి 'మన శంకర వరప్రసాద్‌గారు'

జనం వాయిస్, సినిమా:

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చేసింది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పుడు డిజిటల్ తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. ఈ సినిమాకు ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా, ఫిబ్రవరి 11 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో మిస్ అయినవారికి, మళ్లీ చూడాలనుకునే అభిమానులకు ఇది మంచి అవకాశంగా మారింది. దర్శకుడు అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైన్మెంట్, కామెడీ టైమింగ్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో రికార్డు స్థాయి స్పందన తెచ్చుకుంది. వయసు, జానర్ పరిమితులు దాటి అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి ప్రేక్షకులను థియేటర్లకు లాగగా, ఆయన సరసన నయనతార కథానాయికగా నటించి గ్లామర్‌తో పాటు ఎమోషనల్ టచ్‌ను అందించారు. ప్రత్యేక ఆకర్షణగా విక్టరీ వెంకటేష్ స్పెషల్ అప్పీరెన్స్ అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్‌గా నిలిచింది. ఇక ఓటీటీ వెర్షన్‌కు సంబంధించిన మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ కూడా బయటకు వచ్చింది. థియేటర్లలో




రన్‌టైమ్ కారణంగా కట్ చేసిన కొన్ని కీలక కామెడీ సన్నివేశాలను ఓటీటీ వెర్షన్‌లో తిరిగి జత చేస్తున్నారని సమాచారం. ముఖ్యంగా చిరంజీవి  వీటీవీ గణేష్ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఫుల్ లెంగ్త్ కామెడీ సీన్లు ఓటీటీలో చూడొచ్చని టాక్ వినిపిస్తోంది. దీంతో ఇప్పటికే థియేటర్లలో సినిమా చూసిన అభిమానులు కూడా ఈ ఎక్స్‌టెండెడ్ వెర్షన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి సీజన్‌లో కుటుంబంతో కలిసి థియేటర్లలో చూసిన ప్రేక్షకులు ఇప్పుడు మళ్లీ ఇంటి వాతావరణంలో ఫ్యామిలీతో కలిసి సినిమాను ఎంజాయ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ద తెరపై విజయం సాధించిన ఈ చిత్రం, చిన్న తెరపై కూడా అదే స్థాయి ఆదరణ పొందుతుందా అనే ఆసక్తి నెలకొంది. మొత్తానికి 'మన శంకర వరప్రసాద్ గారు' ఓటీటీ రిలీజ్‌తో మెగాస్టార్ అభిమానులకు మరోసారి పండుగ వాతావరణం నెలకొనడం ఖాయం

# అందాల శ్రద్ధాదాస్‌కు ఆఫర్లు కరువేనా..నెట్టింట మాత్రం అదే హవా..!!

జనం వాయిస్, సినిమా:

టాలీవుడ్ హాట్ బ్యూటీ శ్రద్ధాదాస్ గురించి తెలుగు సినీప్రియులకు ప్రత్యేక పరిచయం అవసరం లేదు. దాదాపు 20 ఏళ్లుగా సినిమా రంగంలో కొనసాగుతున్న ఈ అందాల భామ ఇప్పటివరకు సరైన బ్రేక్ అందుకోకపోయినా, తన గ్లామర్‌తో మాత్రం ఎప్పటికప్పుడు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తూనే ఉంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాళీ భాషల్లో పలు చిత్రాల్లో నటించిన శ్రద్ధాదాస్ స్టార్ హీరోల సినిమాల్లో కనిపించినా ఆశించిన స్థాయిలో స్టార్ డమ్ మాత్రం దక్కలేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి రెండు దశాబ్దాలు పూర్తవుతున్నా సరే.. పెద్ద స్థాయి అవకాశాల కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉంది. ఇటీవల థియేటర్ అవకాశాలు పెద్దగా రాకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం శ్రద్ధాదాస్ హవా మామూలుగా లేదు. 40 ఏళ్లకు చేరువవుతున్నా కూడా చెక్కుచెదరని గ్లామర్‌తో కుర్రకారును మత్తెక్కిస్తోంది. చీరకట్టులో సంప్రదాయంగా కనిపిస్తూ ఒకవైపు ఆకట్టుకుంటే.. మరోవైపు మోడ్రన్ డ్రెస్సుల్లో గ్లామర్ షో చేస్తూ నెట్టింట రచ్చ చేస్తోంది. ఆమె షేర్ చేస్తున్న ఫొటోలు క్షణాల్లోనే వైరల్ అవుతూ లక్షలాది లైకులు, వేలాది కామెంట్స్ దక్కించుకుంటున్నాయి. సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ చూస్తే ఇప్పటికీ ఆమె క్రేజ్ తగ్గలేదని అర్థమవుతోంది. అల్లు అర్జున్, ప్రభాస్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించిన అనుభవం ఉన్నప్పటికీ.. సరైన పాత్రలు దక్కకపోవడం వల్ల ఆమె కెరీర్ ఆశించిన దిశలో సాగలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే అవకాశాలు తగ్గినా.. శ్రద్ధాదాస్ మాత్రం తనను తాను ప్రమోట్ చేసుకునే విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. కొత్త



ఫొటోషూట్లు, ట్రెండీ లుక్స్‌తో సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంటూ దర్శకనిర్మాతల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల షేర్ చేసిన లేటెస్ట్ ఫొటోలు కూడా నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. 'వయసు పెరిగినా గ్లామర్ తగ్గలేదు', 'ఇంకా హీరోయిన్ మెటీరియల్‌నే', 'ఆఫర్లు రావాల్సిందే' అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. కొందరు మాత్రం 'అవకాశాలు లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ ఫామ్‌లో ఉంది' అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి పెద్ద తెరపై అవకాశాలు తగ్గినా.. నెట్టింట మాత్రం అందాల శ్రద్ధాదాస్ హవా కొనసాగుతూనే ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు

# పవన్ కళ్యాణ్ డబుల్ ధమాకా.. ఉస్తాద్ రిలీజ్.. సురేందర్ రెడ్డి మూవీకి ఉగాదినే ముహూర్తం!

జనం వాయిస్, సినిమా:

పవర్ స్టార్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమానులకు వచ్చే నెల నిజంగానే డబుల్ ట్రీట్‌గా మారనుంది. ఒకవైపు ఆయన హీరోగా నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు కొత్త సినిమాకు కూడా అధికారికంగా శ్రీకారం చుట్టనున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తుండటం ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. పవన్ కళ్యాణ్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పాటలు, పోస్టర్లు సోషల్ మీడియాలో మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఎన్నికల తర్వాత పవన్ నుంచి వస్తున్న తొలి భారీ కమర్షియల్ సినిమా కావడంతో ఈ మూవీపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా, పవన్ కళ్యాణ్  సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న మరో భారీ ప్రాజెక్ట్ కూడా అదే నెలలో ప్రారంభం కానుంది. ఉగాది సందర్భంగా మార్చి 19న ఈ చిత్రానికి పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు సినీ వర్గాల్లో టాక్. ఆ తర్వాత ఏప్రిల్ తొలి వారం నుంచే రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉందని సమాచారం. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ



సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో నిర్మించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మించనున్నారని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాక్. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కనిపిస్తున్న స్టైలిష్ లుక్ కూడా ఈ సినిమాకోసమే రెడీ చేసినదేనని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 'ఓజీ' చిత్రంలో ముంబై గ్యాంగ్‌స్టర్ పాత్రలో పవన్‌ను చూసిన ప్రేక్షకులు మరోసారి అలాంటి ఇంటెన్స్ క్యారెక్టర్‌లో చూడాలని కోరుకుంటుండటంతో, ఈ కథ కూడా అదే తరహా రేంజ్‌లో ఉండబోతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అభిమానులు ఈ సినిమా 'ఓజీ' కంటే ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుందని ధీమాగా చెబుతున్నారు. సాంకేతికంగా కూడా ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమాకు అనిరుద్ సంగీతం అందించే అవకాశం ఉందన్న వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అలాగే విలన్ పాత్రలో ఓ ప్రముఖ స్టార్ హీరో కనిపించే ఛాన్స్ ఉందన్న ప్రచారం కూడా సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. అధికారిక వివరాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు వినిపిస్తున్న లీకులే సినిమాపై హైప్‌ను పెంచేస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా పాలనా బాధ్యతల్లో బిజీగా ఉన్నప్పటికీ, రోజుకు 67 గంటల పాటు సినిమా షూటింగ్‌కు కేటాయించేలా తన షెడ్యూల్‌ను ప్లాన్ చేసుకున్నారని సమాచారం. అవసరాన్ని బట్టి పగలు లేదా రాత్రి షూటింగ్‌లో పాల్గొనే విధంగా మేకర్స్ ప్రత్యేకంగా షెడ్యూల్ డిజైన్ చేస్తున్నారట. ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలనే టార్గెట్‌తో టీమ్ ముందుకు వెళ్తోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి మార్చి నెల పవన్ కళ్యాణ్ అభిమానులకు పండగలానే ఉండబోతోంది. ఒకవైపు 'ఉస్తాద్ భగత్ సింగ్'తో థియేటర్లలో సందడి, మరోవైపు సురేందర్ రెడ్డి సినిమా ప్రారంభంతో కొత్త ప్రయాణానికి శ్రీకారం  పవర్ స్టార్ నుంచి రాబోయే ఈ డబుల్ ధమాకా కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. RNI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com